క్లుప్తంగా

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: ఫాల్గుణ బహుళ పంచమిని పురస్కరించుకుని దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు దేసి శ్రీధర్ శర్మ అమ్మ వారిని ప్రత్యేకంగా అలంకరించారు. చుట్టు పక్క గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం


ట్రస్టు సభ్యులకు నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మిస్తున్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి ఆలయానికి పట్టణానికి చెందిన బార్నాల అప్పల నాయుడు కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం ప్రకటించారు. ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు గంట్యాడ విష్ణు, అప్పికొండ ఆది బాబు, ఎస్.వి.జి.శ్రీనివాసరావు, డి.రవి, దిలీప్‌కుమార్‌కు దాత ఆదివారం తన నివాసంలో నగదు అందజేశారు.

బాధిత కుటుంబానికి సహాయం


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లక్కవరపుకోట: మండలంలోని కంటకాపల్లి పంచాయతీ పరిధి సాంబయ్యపాలెం గ్రామంలో మేడిశెట్టి సత్తిబాబుకు చెందిన శ్లాబ్ ఇంట్లో షార్ట్ సర్క్యూట్ వల్ల శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో గృహోపకరణాలు, విలువైన సామగ్రి కాలిబూడిదైన విషయం విధితమే. బాధిత కుటుంబాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మదీనా, అప్పలరమణ, పి.ఎస్.ఎన్.పాత్రుడు, పి.శ్రీనివాసరావు, పి.రాజేష్, ఎల్.ఎస్.పాత్రుడు, పి.శ్రీనివాసరావు, ,పి.అప్పలరాజు, ఎల్.త్రినాథ్ ఆదివారం పరామర్శించారు. రూ.4,000 నగదు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


పోటీల్లో పరుగుతీస్తున్న ఎద్దులు

వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలో కృష్ణాలయం వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీలు ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగాయి. 12 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొనగా.. మొదటి ఆరుస్థానాల్లో నిలిచిన ఎద్దులకు సంబంధించిన యజమానులకు నగదు బహుమతిని గ్రామపెద్దలు, యాదవ సంఘం సభ్యులు అందజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

రెవెన్యూ డివిజన్‌లో 17 పోలింగ్ కేంద్రాలు


గరివిడిలోని పోలింగ్ కేంద్రం వద్ద సామగ్రి తీసుకుంటున్న సిబ్బంది

చీపురుపల్లిరూరల్ (గరివిడి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి చీపురుపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలో 17 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. చీపురుపల్లి, రాజాం నియోజకవర్గాల్లో 8 మండలాలతో పాటు నెల్లిమర్ల మండలంతో కలిపి 9 మండలాల్లో 17 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ పోలింగ్ కేంద్రాలకు గరివిడి ఎస్‌డీ ఎస్ డిగ్రీ కళాశాల నుంచి పోలింగ్ సామగ్రిని ఇన్‌చార్జి ఆర్డీఓ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సామగ్రి తీసుకుని సిబ్బంది ఆదివారం సాయంత్రమే కేంద్రాలకు చేరుకున్నారు.

మజ్జిగౌరమ్మ, భద్రకాళి యాత్ర

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం సంతలో మజ్జిగౌరమ్మ, భద్రకాళి యాత్ర ఆదివారం నిర్వహించారు. ఆలయం లో అమ్మవార్లకు వేదపండితులు వెంకటరమణ శర్మ, శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి కుటుంబ సభ్యులు ఉదయాన్నే పుసుపు, కుంకుమ చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుపక్క గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వైఎస్సార్‌సీపీ పేదల పక్షం

- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం
- వేడుకలకు హాజరైన పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు


చీపురుపల్లి: కేకు కట్ చేస్తున్న జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు


కొత్తవలస: పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు


గజపతినగరం: పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

చీపురుపల్లి: పేదలకు అండగా నిలుస్తూ, పేదల పక్షపాతిగా ఉంటూ, పెత్తందారీ వ్యవస్థకు ఎదురు నిలబడుతూ, దివంగత మహానేత వైఎస్సార్ ఆశయాల సాధనే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు అతిథిగా హాజరైన పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు దివంగత మహానేత వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేసి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ స్థాపించిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చిందన్నారు. అయినప్పటికీ ఆయన తండ్రి మాదిరిగానే పేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో కష్టాలను ఎదుర్కొని నిలబడిన సంగతి గుర్తు చేశారు. జగన్ నాయకత్వాన్ని నమ్మిన ప్రజలు 2019లో 151 స్థానాలకు వైఎస్సార్‌సీపీకి అధికారం కట్టబెట్టారని అన్నారు. గడిచిన నాలుగేళ్లల్లో పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. పార్టీ, కులం, మతం, జెండా చూడకుండా అర్హత ఉన్న వారందరికీ పథకాలను అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. నాలుగు దశాబ్దాల చరిత్ర తమదని చెప్పుకునే తెలుగుదేశం పార్టీ చేయలేని ఎన్నో సంక్షేమ పథకాలను జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారని, ఆయనకు ప్రజలు మద్దతు ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, దన్నాన జనార్దన, పతివాడ రాజారావు, సువ్వాడ అప్పలనాయుడు, కరిమజ్జి శ్రీనివాసరావు, అధికార్ల శ్రీనుబాబు, వలిరెడ్డి లక్ష్మణ, పొన్నాడ కుమార్, రఘుమండ త్రినాథ్ ఇప్పిలి తిరుమల పాల్గొన్నారు.

సవాళ్లను అధిగమించి.. ప్రజల పక్షాన నిలిచి

కొత్తవలస: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ, ప్రజల పక్షాన నిలిచిందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని కొత్తవలసలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో ఆదివారం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ స్థాపించిన నాటి నుంచీ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలపై పోరాడరని గుర్తు చేశారు. ఎన్నో సవాళ్లను అధిగమించి, సంపూర్ణ ప్రజాబలంతో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 98 శాతం వరకు అమలు చేసి, ప్రజారంజక పరిపాలన చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, కొత్తవలస ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి బొంతుల వెంకటరావు, నాయకులు గొరపల్లి రవి, పెనుగంటి చెల్లయ్య,ఆదిరెడ్డి అప్పన్న, విరోతి కొండలరావు, లెంక భాస్కర్, కారుమూరి కృష్ణ, పూసర్ల రఘు, ఏడుకొండలు, బాలరాజు, రామకృష్ణ, నిమ్మలపాలెం శ్రీను మాస్టర్, రామసత్యం, ఆతవ రమేష్, దేముడు బాబు ,కాటకాపల్లి అడిగర్ల సంతోష్ అడిగర్ల చిన్నమనాయుడు,దేముడు నాయుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

పేద ప్రజలకు అండగా ఉండే పార్టీ..

గజపతినగరం: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యేతో పాటు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పేద ప్రజలకు అండగా ఉండే పార్టీ అన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న హామీల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 98 శాతం అమలు చేశారన్నారు. పేద,బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నారని, విద్య,వైద్య, వ్యవసాయ రంగాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని వివరించారు. విద్యరంగానికి రూ.60 వేల కోట్లు ఖర్చు చేశారని, నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా అభివృద్ధి చేశారని అన్నారు. రైతులకు విత్తనాలు,ఎరువులు గ్రామాల్లోనే అందించేందుకు, పంటలను కొనుగోలు చేసేందుకు రైతుభరోసా కేంద్రాలను సీఎం జగన్ నెలకొల్పారన్నారు. సీనియర్ నాయకులు ప్రభూజీరాజు, స్థానిక జెడ్పీటీసీ గార తవుడు, పార్టీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, బొండపల్లి ఎంపీపీ చల్లా చల్లం నాయుడు, నాయకులు బెల్లాన త్రినాథరావు, మండల సురేష్, రేగ సురేష్, కర్రి రామునాయుడు, జేసీఎస్ కన్వీనర్ కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.


గజపతినగరం: ఏరియా ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మెరకముడిదాం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


వేపాడ: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ప్రజాప్రతినిధులు,నాయకులు

మెరకముడిదాంలో..

మెరకముడిదాం: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను నాయకులు ఆవిష్కరించారు. అనంతరం దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళలర్పించారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్.వి.రమణరాజు, తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, కె.ఎస్.ఆర్.కె.ప్రసాద్, బూర్లె నరేష్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

వేపాడలో..

వేపాడ: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ మండల అధ్యక్షుడు ఎం.జగ్గుబాబు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. దివంగత మహానేత వైఎస్. రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల అర్పించారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, కేక్ కట్ చేశారు. డీసీసీబీ చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు, ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, జెడ్పీటీసీ ఎస్.అప్పారావు, ఏఎంసీ చైర్మన్ ఎం.కస్తూరి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ సీహెచ్ పద్మావతి, పంచాయతీ రాజ్ జోన్ కన్వీనర్ మెరపల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, మండల జేఎస్‌సీ కన్వీనర్ బోజంకి శ్రీను, మండల యూత్ అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ రీజియన్ సమావేశం


ఉత్తమ సేవలందించిన క్లబ్ సభ్యులకు జ్ఞాపికలు అందజేస్తున్న రీజియన్ చైర్మన్ రమణారావు

చీపురుపల్లిరూరల్: లయన్స్ క్లబ్ రీజియన్ సమావేశం గరివిడి శ్రీరామ్‌నగర్ లయన్స్ క్లబ్‌లో రీజియన్ చైర్మన్ రమణారావు అధ్యక్షతన ఆదివారం సమావేశం నిర్వహించారు. చీపురుపల్లి, రాజాం, పార్వతీపురం, సాలూరు, గజపతినగరం, విజయనగరం లయన్స్ క్లబ్‌ల సభ్యులు హాజరయ్యారు. లయన్స్ ఆధ్వర్యంలో సేవలను మరింత విస్తరించాలని క్లబ్ రీజియన్ చైర్మన్ సూచించారు. అనంతరం ఆయా క్లబ్‌లు ద్వారా ఉత్తమ సేవలందించిన ప్రతినిధులకు రీజియన్ చైర్మన్ జ్ఞాపికలు అందజేసి అభినందించారు.

కన్నవారి దీవెన



బాలికలను దీవిస్తున్న తల్లిదండ్రులు

వేపాడ: స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో కన్నవారి దీవెన కార్యక్రమం ప్రిన్సిపాల్ ఉషారాణి నేతృత్వంలో ఆదివారం నిర్వహించారు. ఇంటర్మీడియట్, పదోతరగతి విద్యార్థినులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వచనాలు అందించారు. అనంతరం పిల్లలకు తల్లిదండ్రులు స్వీట్లు పంచారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థినులు భయం వీడి ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. అనంతరం హాల్‌టిక్కెట్లు పంపిణీ చేశారు. అలాగే 2023–24 విద్యాసంవత్సరానికి సంబంధించి 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైందని, గ్రామాల్లోని విద్యార్థినులు దరఖాస్తు చేసుకునేలా చూడాలని తల్లిదండ్రులకు సూచించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా కనకమహాలక్ష్మి మారు జాతర

చీపురుపల్లి: పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి రెండో వారం మారు జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫిబ్రవరి 26, 27, 28 తేదీల్లో అమ్మవారి జాతర నిర్వహించిన సంగతి తెలిసిందే. ఉదయం 5 గంటల నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు తరలివచ్చారు. అనంతరం దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి గోవింద, వైస్ చైర్మన్ సూరు కుమార్ తదితరులు ప్రారంభించారు.


పూజలందుకుంటున్న కనకమహాలక్ష్మి అమ్మవారు


పూజలందుకుంటున్న శీతలామాత అమ్మవారు

ప్రారంభమైన శీతలామాత జాతర

చీపురుపల్లి పట్టణంలోని శీతలామాత(సంతానలక్ష్మి) అమ్మవారి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు నిర్వహించనున్న జాతరలో తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

శ్రీరామ నవమికి ముస్తాబవుతున్న రామతీర్థం

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రమైన రామతీర్థం సీతారామస్వామి దేవస్థానం శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 30న రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో నవమి వేడుకలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆలయం వెలుపుల ఉన్న యాగశాలను తాటాకుల కమ్మలతో సిద్ధం చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వేద పండితులు నవమి వేడుకలకు పది రోజుల ముందు నుంచే యాగశాలలో విశేష హోమాలను ప్రారంభిస్తారు. శివరాత్రి ఉత్సవాల్లో యాగశాలకు ఉన్న పాత తాటాకుల కమ్మలను తొలగించారు. శ్రీరామనవమి సమీపిస్తుండడంతో యథావిధిగా తాటాకులతో యాగశాలను సిద్ధం చేశారు.

భవనాల ఆధునికీకరణకు వినతి


ఎంపీ బెల్లానను కలిసిన నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

చీపురుపల్లిరూరల్: జిల్లాలోని ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం భవనాల మరమ్మతులు, ఆధునికీకరణ, అదనపు భవనాల నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయాలని ఆ సంఘ జిల్లా,తాలూకా కార్యవర్గ సభ్యులు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ను కోరారు. ఎంపీని చీపురుపల్లిలోని ఆయన నివాసంలో నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం సభ్యులు ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీ సానుకూలంగా స్పందించారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు ఎం.గంగాప్రసాదరావు, సంఘ ప్రతినిధులు చందక శ్రీనివాసరావు, జి.రాము, కె.సూరిబాబు, రమేష్,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యోగా దినచర్యలో భాగం కావాలి


యోగాపై అవగాహన కల్పిస్తున్న రామగోపాల్, తదితరులు

చీపురుపల్లి: యోగా సాధనతో ఆరోగ్యంగా ఉండవచ్చని, ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని యువజన సర్వీసుల శాఖ సీఈఓ బి.రామగోపాల్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఆవరణలోని బాలికల వసతిగృహంలో ఆశయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దినచర్యలో నిర్వహించిన యోగా శిబిరానికి ఆయన హాజరయ్యారు. పట్టణానికి చెందిన శ్రీ చైతన్య యోగా సెంటర్ వ్యవస్థాపకులు గవిడి సుజాత విద్యార్థులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. అనంతరం సీఈఓ రామగోపాల్ మాట్లాడుతూ యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, శారీరక, మానసిక ఒత్తిళ్ల నుంచి బయటపడి ఆరోగ్యవంతులుగా జీవించవచ్చన్నారు. విద్యార్థులు రోజూ కొంత సమయం యోగాకు కేటాయించాలని సూచించారు. ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, వసతిగృహ సంక్షేమాధికారి యశోధ తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి


పార్టీ నాయకులకు సూచనలు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తదితరులు

శృంగవరపుకోట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ బూత్ ఏజెంట్లు కీలకంగా వ్యవహరించాలని, అప్రమత్తంగా ఉంటూ సక్రమంగా తమ విధులు నిర్వర్తించాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులను కోరారు. ఆదివారం సాయంత్రం ఎస్.కోట క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేశ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకులు తైనాల విజయ్‌కుమార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పోలింగ్ ఏజెంట్లతో సమావేశమయ్యారు. పట్టభద్ర ఓటర్లు పోలింగ్ బూత్‌కి వచ్చేలా చూడాలని, వారి వివరాలను కచ్చితంగా సరిచూసుకోవాలని, పార్టీ నాయకులు ఎక్కడా తప్పులు జరిగే అవకాశం లేకుండా పనిచేయాలని కోరారు. ఎమ్మెల్సీ రఘురాజు, పార్టీ పరిశీలకులు తైనాల పార్టీ శ్రేణులకు ఎన్నికలకు సంబంధించి కొన్ని సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మోపాడ కుమార్, డైరెక్టర్ వి.రాంబాబు, నాయకులు పి.రామకృష్ణ, పార్వతి, మోపాడ కోటి, కె.రంగా, కె.జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన


జామి: పోలింగ్ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి


దత్తిరాజేరు: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు


గజపతినగరం: ఏర్పాట్లు పరిశీలిస్తున్న సీఐ అప్పలనాయుడు, తహసీల్దార్ అరుణకుమారి,ఎంపీడీఓ సుదర్శనం

వేపాడ/ జామి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సోమవారం నిర్వహించనున్న నేపథ్యంలో వేపాడ, జామి మండల కేంద్రాల్లోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను కలెక్టర్ ఏ.సూర్యకుమారి ఆదివారం పరిశీలించారు. వెబ్ కెమెరాలు, ఓటర్లకు కల్పించిన సదుపాయాలు తదితర ఏర్పాట్లపై అధికారులను ఆరా తీశారు. అప్పటికే పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పటిష్ట బందోబస్తు నిర్వహించాలని పోలీసులకు సూచించారు. కలెక్టర్ వెంట వేపాడ తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఉపతహసీల్దార్ సన్యాసినాయుడు, ఎస్ఐ రాజేష్, వీఆర్ఓ బాల భాస్కర్, జామి తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, ఈఓపీఆర్డీ ఐ.వి.లక్ష్మి, ఎస్ఐ వీరబాబు తదితరులు ఉన్నారు.

ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

దత్తిరాజేరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను మండల పోలింగ్ అధికారి(పీఓ) గౌతం, తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం ఆదివారం పరిశీలించారు. ఓటర్లకు ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించామని, పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారని తహసీల్దార్ చెప్పారు. పోలింగ్ కేంద్రం బయట వైద్యశిబిరం ఏర్పాటు చేస్తామని వైద్యాధికారి ఆనంద్‌కుమార్ తెలిపారు.

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు చర్యలు

గజపతినగరం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని స్థానిక సీఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. గజపతినగరం మండలం కేంద్రంలోని పురిటిపెంట బాలుర హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాన్ని మండల అధికారులతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. తహసీల్దార్ ఎం.అరుణకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీఓ పప్పు సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.